# మంగమ్మగారు - మానవసేవ

-డాక్టర్ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"ఏవండీ! మనం ఇలా వృధాగా కాలం గడపటం ఏమీ బాగాలేదు". మధ్యాహ్నం నిద్ర ముగించిన మంగమ్మగారు, అమ్మాయి అమెరికా నుండి తెచ్చిన జీడిపప్పు గుప్పెడు తీసుకువచ్చి మొగుడి దోసట్లో కాసిని పోసి, మిగిలినవి తన చేతిలో ఉంచుకుని, ఆయనెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని అన్నారు.

జీడిపలుకులు నోట్లో వేసుకోబోతున్న మంగపతిగారు ఉలిక్కిపడి, ఆగిపోయి ప్రశ్నార్థకంగా చూశారు భార్యవైపు.

"అది కాదండీ. పనీపాటూ లేకుండా, ఏ వ్యాపకమూ లేకుండా ఉంటే తొందరగా ముసలితనం ముంచుకువస్తుందిట. ఈ మధ్యన పత్రికలలో ఒకటే ఇదిగా రాస్తున్నారు." అన్నాదావిడ మళ్లీ తనే.

"అంటే నన్ను మళ్లీ ఉద్యోగంలో చేరమంటావా ఏమిటి కొంపదీసి? నేను పని చేయడానికి సిద్ధపడినా, మన కొత్త సి.ఎం.గారు రిటైరయిన వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వగూడదని ఫర్మానా జారీ చేసేశారు కదుటోయ్"

ఇక అక్కడికి ఆ చర్చ ముగిసిందన్నట్టు కళ్లద్దాలు పంచెతో తుడుచుకుని, కళ్లకు పెట్టుకుని, జపేపరు చేతిలోకి తీసుకున్నారు.

"అబ్బా! ఏదీ పూర్తిగా వినరు కదా! అయినా మనకు ఈ వయసులో సంపాదించాల్సిన అవసరమేముంది గనుక? పిల్లలు లక్షణంగా అమెరికాలో ఇళ్లు కట్టుకుని సెటిల్ అయ్యారు. వాళ్లకోసం మనం డబ్బు కూడబెట్టి ఇవ్వాల్సిన అవసరం లేదు. మనకు వచ్చేది మనకు చాలు. ఇప్పుడయినా మనకు చేతనయినంతలో నలుగురికి ఉపయోగపడే నాలుగు మంచి పనులు చేద్దాం. మానవసేవ మాధవసేవ అన్నారు కదా. అదేదో చేస్తే అటు పుణ్యము, ఇటు పేరు కూడా దక్కుతాయి" అన్నారు మంగమ్మగారు మొగుడి చేతిలోని పేపరు లాగిపడేస్తూ.

ఆవిడ అనుకున్నదేదో చేసేవరకు ఊరుకోదని తెలిసిన మంగపతిగారు పేపరు మీద ఆశ వదిలిపెట్టి "ఏం చేస్తే బాగుంటుందో చెప్పు" అన్నారు.

"అలా అన్నారు బాగుంది. నాకో ఆలోచన వచ్చింది. ఊళ్లో ఇంజనీరింగ్ కాలేజీకి అవతల 'ఓల్డ్ ఏజ్ హోమ్' ఉన్నదని, ఎప్పుడేనా అలా వెళ్లి చూసి రావాలని అనుకున్నాం కదా చాలాసార్లు..." అంటూ ఆగిందావిడ.

"ఇప్పుడు సరైన సమయం వచ్చిందంటావా? అయినా మనం ఇంకో పదేళ్ల వరకు ఎలాగో బండి లాక్కు రావచ్చు. ఆ తరువాత ఆలోచిద్దాం" అన్నారు అయిష్టంగా.

"మిమ్మల్ని అక్కడ చేరమని ఎవరన్నారండి? రెండు రోజుల్లో గాంధీ జయంతి వస్తుంది కదా! ఆ రోజు అక్కడకు వెళ్లి అక్కడున్న వాళ్లను పలకరించి, వాళ్లకు ఏవన్నా ఇచ్చి సంతోషపెట్టి వద్దాం...ఇలా ఉంది నా ఆలోచన?" అనడిగింది మంగమ్మగారు.

"అంటే మనం గాంధీ జయంతి నాడు అక్కడికి వెళ్తున్నాం అని నిశ్చయించేశావన్నమాట." అంటూ నవ్వేశారు మంగపతిగారు.

★★★

అనుకున్న ప్రకారం గాంధీ జయంతి రోజున 'ఓల్డ్ ఏజ్ హోమ్'కి వెళ్లి వచ్చాక చాలా సంతోషంగా, ఉత్సాహంగా కనబడ్డారు మంగమ్మగారు.

ఆ విషయం ఎదురింటి వాళ్లకి, పక్కింటి వాళ్లకు వివరంగా చెప్పారు కూడా.

రెండ్రోజులు గడవకముందే ఒక రోజు ప్రొద్దున్నే తమ ఇంటికి ఎవరో నలుగురు వచ్చి 'ఓల్డ్ ఏజ్ హోమ్' నిర్వాహకులమని చెప్పగానే మంగమ్మగారికి ఆనందం కలిగింది.

అప్పుడే తాము చేసిన మంచి పనికి గుర్తింపు వచ్చేసిందన్న మాట అనుకుని "రండి..రండి...కూర్చోండి" అంటూ వాళ్లకు మర్యాదలు నెరపిందావిడ.

అంతలో అటు వచ్చిన మంగపతిగారిని చూడగానే ఆ నలుగురూ ఒకేసారి ముక్తకంఠంతో "ఏమిటండీ ఇంత చదువుకున్నారు. పైగా అమెరికా కూడా వెళ్లి వచ్చామని చెప్పారట. ఆ ముసలి వాళ్లందరికీ నేతి మిఠాయిలు పంచి పెట్టారట. శుభ్రంగా తినేసి, మర్నాడే మంచమెక్కారు" అన్నారు.

"అయ్యో ... అలా ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశమే లేదండీ. అవి ప్రఖ్యాతి చెందిన వాళ్ల మిఠాయిలు" అన్నారు మంగపతిగారు.

"కానీ చక్కెర వ్యాధి ఉన్న వాళ్లకు అవి ఎంత గొప్ప మిఠాయిలయినా విషమే కదండీ! ఎంతో జాగ్రత్తగా చూస్తూ వాళ్ల వ్యాధిని అదుపులో ఉంచుతున్నాం. మీరు చేసిన పని వలన మేము ఆసుపత్రి చుట్టూ తిరగాల్సి వచ్చింది." నిష్ఠూరంగా అన్నారు వాళ్లు.

మంగపతిగారు వాళ్లకి సర్ది చెప్తుండగానే చల్లగా లోపలికి జారుకుంది మంగమ్మగారు.

చేసిన తప్పుకు జరిమానాగా వాళ్లు నడుపుతున్న హోమ్‌కు రెండువేలు చందా కింద ఇచ్చి వాళ్లని శాంతపరచి పంపించారు మంగపతిగారు.

"ఊరికే ఉండకుండా ఏవో ఆలోచనలతో ఇదిగో ఇలా కొంపమీదకి తెస్తావు" అంటూ భార్య మీద విసుక్కున్నాడాయన.

"బాగుందండీ! మంచికి పోతే ఏదో అయ్యిందనా... ఇలా అవుతుందని కలగన్నామా ఏమిటి? అయినా ఏవో చిన్న అవాంతరాలు వస్తూనే ఉంటాయి. అలాగని మంచి పనులు చేయడం మానుకుంటామా?" అంటూ మొగుడిని దబాయించింది మంగమ్మగారు.

అనవసరమైన వాదన దేనికన్నట్టు మౌనం వహించారు మంగపతిగారు.

మరో నెలదాకా మంగమ్మగారు మానవసేవ

గురించి మాట్లాడక పోవడంతో స్థిమితపడ్డాడా యన.

★★★

క్రిస్మస్ దగ్గరకు వస్తుండగా మంగమ్మగారు హడావుడి పడడం మొదలుపెట్టారు. ఎప్పటెప్పటివో ఇంట్లో పోగుబడి ఉన్న పిల్లల పాత బట్టలు, తనకు విసుగు పుట్టి కుట్టడం మానేసిన నూలు చీరలు, పాత దుప్పట్లు అన్నీ బయటకు తీసి ఉతికించి ఇస్త్రీ చేయించి పెట్టడంలో మునిగిపోయిందావిడ.

"ఏమండీ! మనం రేపు దళితవాడకు వెళ్తున్నాం" అన్నదావిడ క్రిస్మస్ ముందు రోజు.

"అదేమిటి? ఉన్నట్టుండి నీకు రాజకీయాల మీద మోజు పుట్టిందా ఏం?" అంటూ ఆశ్చర్యపోయారు మంగపతిగారు.

"జోకులు వేయకండి. నాకు ఒళ్ళు మండుతుంది. అక్కడున్న పేదవారికి బట్టలు పెట్టి వద్దాం" అందావిడ.

"అదేదో మన పండుగ నాడు ఇవ్వొచ్చును కదా! క్రిస్మస్ రోజునే వెళ్లాలని ఎందుకనుకుంటున్నావు?" అమాయకంగా అడిగాడాయన.

"మన పండుగకు అలాటి దానధర్మాలు చేస్తే మత ఛాందసవాదులం అనిపించుకుంటాము. ఇప్పుడయితే లౌకికవాదులం. తెలిసిందా?" ఇంత మాత్రం లోకజ్ఞానం లేదేం? అన్నట్టు మొగుడి కేసి జాలిగా చూసి చెప్పిందావిడ.

"సరే...సరే.." అంటూ అలవాటయిన ధోరణిలో తల గుండ్రంగా ఊపాడాయన.

అనుకున్న ప్రకారం దళితవాడకు వెళ్లారు.

ఎండలో ఒక్కొక్క ఇంటికీ వెళ్లి తను తెచ్చిన బట్టలు ఇవ్వడానికి ప్రయత్నించారు మంగమ్మగారు.

"ఈ నూలు చీరలు ఎవరు కట్టుకుంటారమ్మా? పాలిస్టరవి లేవా? రంగు వెలిసిపోయినవి మాకెందుకు?" అంటూ కొందరు నిరాకరించారు.

మరికొందరు ఆవిడ తెచ్చిన వాటిలో నచ్చినవి కొన్ని ఏరుకుని "ఏదో ఇంత దూరం వచ్చినావని తీసుకున్నాం" అని ఆవిడను ఉద్ధరించినట్టు మాట్లాడారు.

మధ్యాహ్నానికల్లా నీరసం వచ్చి "ఇక పోదాం పదండి" అంటూ మిగిలిన బట్టల మూట కార్లో పెట్టి మొగుడి పక్కన కూలబడింది మంగమ్మగారు.

"ఈ వయస్సులో నీకెందుకే ఈ హైరానా? ఏవన్నా అంటే నేను నీకు ఏవిధంగానూ సహకరించటం లేదని నింద వేస్తావు" ఇంటికి రాగానే కళ్లు మూసుకుని పడుకున్న భార్యకు బత్తాయి రసం తీసి అందిస్తూ లాలనగా అన్నాను మంగపతిగారు.


మాట్లాడకుండా పళ్లరసం తాగి పడుకుంది మంగమ్మగారు.

★★★

మర్నాడు పొద్దున్నే పేపరు చదవడానికి ఉపక్రమించారు మంగపతిగారు.

"ఇదిగో...నీ ఘనకార్యం గురించి పేపర్లో వేశారు" అంటూ భార్యను పిలిచారు.

"మీ కళ్లకయితే నేను ఎందుకూ పనికిరానిదానిలా కనబడతానుగానీ నా విలువ బయటి వాళ్లైనా గుర్తించరా? ఏ రాశారో చదవండీ" అంటూ తొందరపెట్టింది మంగమ్మగారు.



"తొందరగా చదవండీ... ఇంకా నేను స్నానం కూడా చేయలేదు..." అంటూ కంగారు పెట్టింది.

ఆవిడ ఎంచేతో స్థిమితంగా కూర్చోలేక పోతోంది. మనసులో ఏమిటో దడగా ఉంది.

పేపరు వాళ్లెవరైనా ఇంటర్వ్యూ చేస్తామంటూ వస్తారో ఏమిటో... మానవ సేవ చేస్తే మంచి పేరు వస్తుందని అనుకుందేగానీ మరీ ఇంత త్వరగా గుర్తింపు వస్తుందని ఆవిడ ఊహించలేదు. ఒకవేళ పేపరువాళ్లు తన ఫోటో వేస్తామంటారో ఏమిటో?

ఏ చీరె కట్టుకుంటే బాగుంటుందో చూసి సిద్ధంగా పెట్టుకోవాలనుకుందావిడ.

"నువ్వు స్నానం చేసి, మడికట్టుకుని మరీ వినాల్సినంత గొప్ప వార్త కాదులేవే." అంటూ చదివారు.

"దళితవాడలో ఇటీవల ఒక మతం నుండి మరొక మతంలోకి మారిన కొందరికి బట్టలు, వస్తువులు ఆశ చూపి తిరిగి తమ మతంవైపు ఆకర్షించాలని కొందరు ప్రయత్నించినట్టు ఒకరు ఈ విలేకరికి సమాచారం అందించారు." అని చదివి ఆగారు.

మంగమ్మగారి ముఖంలో మెరుస్తున్న చిరునవ్వు హఠాత్తుగా పక్కకు తప్పుకుంది.

కళ్లలో బాధావీచికలు తొంగి చూశాయి.

వెంటనే సద్దుకుందావిడ. "మదర్ థెరిసా వంటి మహనీయురాలినే మొదట్లో ప్రజలు అర్థం చేసుకోలేదు. ఆఫ్టరాల్ నేనెంతదాన్ని? ఇలాటి తాటాకు చప్పుళ్లకి బెదిరిపోతే మనమేమీ సాధించలేం. అది గుర్తుంచుకోండి." అంటూ కొంగు దులిపి, నడుము చుట్టూ తిప్పి, దోపుకుని లోపలికి నడిచారు మంగమ్మగారు.

'అయితే మరొక బృహత్తర పథకమేదో ఈమె మెదడులో రూపుదిద్దుకోబోతోందన్న మాటే' అనుకుంటూ పేపరులో తలదూర్చారు మంగపతిగారు.

## తూనీగ

వల ఆకారంలో గాజుగుడ్డలాటి రెక్కలుగల తూనీగ తన భారానికి పదిహేనురెట్లు అధిక భారాన్ని అతి సునాయాసంగా ఎత్తగలదు. శాస్త్రజ్ఞులు విమానాలను తూనీగ నమూనాలో తయారుచేయడానికి పరిశోధనలు చేస్తున్నారట.

## మెదడుకు శస్త్రచికిత్స


ప్రొఫెసర్ టార్బెల్‌రోడా ఆధ్వర్యంలో పశ్చిమజర్మనీ పురావస్తు శాస్త్రజ్ఞులు ఇరాక్‌లోని బాగ్దాద్ దగ్గర ఈసెన్‌లో కనుగొన్న మానవ కపాలాలు సుమారు రెండువేల బిసిలో మెదడుకు శస్త్రచికిత్స చేయబడినవని నిర్ధారణ చేసారు. అనేక శతాబ్దాలకు పూర్వం బాబిలోనియా ఏర్పడకముందు మెసపుటోమియా (ఇప్పటి ఇరాక్) వైద్యానికి ముఖ్య కేంద్రంగా ఉండేది.

-రాంబాబు

## సెక్స్ మ్యూజియం

ఇటీవల న్యూయార్క్ నగరంలో ఒక సెక్స్ మ్యూజియమ్‌ని ప్రారంభించారట. ఆ మ్యూజియమ్‌లో ఫొటోలు, సినిమాలు, వ్యభిచారంమీద చరిత్ర, న్యూయార్క్ సిటీలో సెక్స్ చరిత్ర, అమెరికన్ల సెక్స్ విధానాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు... ఇలా అనేక విషయాలను అక్కడ ప్రదర్శిస్తున్నారట.

-విమలారామం




* * *

సంక్రాంతి వచ్చి వెళ్లింది. ఒక శనివారం ఉదయాన్నే వెంకటరమణ కాలనీలోని వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు మంగమ్మగారి దృష్టి స్టేషన్‌రోడ్డులో అటూ ఇటూ పేవ్‌మెంట్లు మీద బారులు తీరి కూర్చున్న కూలి జనం మీద పడింది.

పక్కన ఉన్న పల్లెల నుండి రైల్లో కర్నూలుకు వచ్చి ఏ.రోజుకారోజు పని కోసం అక్కడ కూర్చుని ఎదురుచూస్తూ ఉంటారు వాళ్లు.

అందులో వయసులో ఉన్న ఆడవాళ్లందరి చేతుల్లోనూ చంటిబిడ్డలున్నారు.

"చూశారా పావం! కూలికి పోకపోతే పొట్ట గడవదు. ఈ చిన్న పిల్లని ఎండలో చెట్లు కింద వదిలేసి వీళ్లు కూలిపనిలోకి దిగుతారు" జాలిగా అందావిడ.

కారు నడుపుతున్న మంగపతిగారికి కాస్త చెమట పట్టింది. అంత ఎండగా లేకపోయినా... ఆవిడ మనసులోని ఆలోచన ఏమిటో ఆయనకు అంతుచిక్కలేదు.

ఆ సాయంత్రం 'టీ' అందిస్తూ మొగుడికి చెప్పింది మంగమ్మగారు. "ఆ కూలీల పిల్లలను ప్రొద్దున్న నుంచి సాయంకాలం దాకా నీడ పట్టున ఉంచే ఉపాయం తోచిందండీ నాకు" అని.

ఆయన చేతిలోని కప్పు కదలి, వేడి టీ కాస్త తొణికి ఆయన మీదపడింది.

"మన కారు షెడ్‌లో పిల్లల్ని వదిలి వెళ్లమని చెపుదాం...అంతగా అయితే ఒక ఆయాను పెడదాం పిల్లల్ని చూడటానికి. ఈ రకంగా అయినా కాస్త సంఘ సేవ చేసిన వాళ్లమవుతాం" అందావిడ.

ఈ మాటలు అంటున్నప్పుడు ఆవిడ ముఖంలో ఒక విధమైన ఉద్విగ్నత, ఏదో సాధించబోతున్నామన్న ఆనందం తొంగి చూశాయి.

"కాస్త ఆలోచించవే. ఇదేమంత తేలిక పని కాదు" అన్నారు మంగపతిగారు. ఆవిడ ఉత్సాహాన్ని నీరు కారుస్తున్నానేమో అని సంకోచిస్తూనే.

"నేనన్నీ ఆలోచించానండీ! మధ్యాహ్నం పూట పిల్లలకు చెరో గ్లాసు పాలు ఇచ్చే ఏర్పాటు చేద్దాం. రోజుకు రెండు లీటర్ల పాలు అదనంగా తెప్పిస్తే చాలు. మనకున్న దాంట్లో వాళ్లకు కాస్త ఖర్చు పెడదాం... అందావిడ నిక్కచ్చిగా.

* * *

ఆవిడ అనుకున్నట్టుగానే ఒక ఆయాను ఏర్పాటు చేసింది.

ఆ కూలి జనాలకు నచ్చజెప్పి వాళ్ల పిల్లల్ని అక్కడ వదిలి వెళ్లేట్టు ఒప్పించింది.

మరీ చంటిపిల్ల తల్లులు బిడ్డలను తమతో తీసుకుపోయినా రెండేళ్లు దాటిన పిల్లలు పదిమందిదాకా వచ్చారు.

వాళ్ల కోసం పలకలు, బలపాలు కొనుక్కొని వచ్చింది మంగమ్మగారు.

నాలుగు రోజుల్లో పిల్లల సంఖ్య పది నుండి ఆరుకి పడిపోయింది. "అదేంది పాలు ఇచ్చినారో పిల్లోడికి ఒకటే వాంతులు నిన్న" అంది ఒక తల్లి.

"మా సంటిదానికయితే ఈ రేకుల షెడ్డు వేడికి జ్వరమొచ్చేసినాది" అంది మరో అమ్మ.

అయినా మంగమ్మగారు నిరాశపడలేదు. సాయంత్రం పిల్లల్ని తీసుకువెళ్ల డానికి తల్లులు వస్తే వాళ్లకు 'టీ' ఇచ్చి ఒక గంట కూర్చుని అక్షరాలు నేర్చుకో మని నచ్చబలికింది.

ఆవిడ ఇచ్చే 'టీ' కోసం కాసేపు కూర్చుని వెళ్లడం మొదలుపెట్టారు పది మంది ఆడకూలీలు.

తను చేస్తున్న సేవ గురించి తెలిసిన వాళ్లందరికీ చెప్పింది మంగమ్మగారు. వారిలో ఒకావిడ లేడీస్ క్లబ్ మెంబరుంది. ఆవిడ ద్వారా వెల్ఫేర్ వాళ్లకి తెలి సింది.

మార్చి ఎనిమిదవ తారీకున విమెన్స్ డే సందర్భంగా జిల్లా పరిషత్ హాలులో జరగబోయే మీటింగుకు రమ్మని మంగమ్మగారిని ఆహ్వానించారు. ఆవిడ దగ్గరకు వచ్చే స్త్రీలను తప్పక తీసుకురమ్మని మరీ మరీ చెప్పారు.

తలకు ఇరవై రూపాయలు ఇస్తానని ఆశపెట్టి, ఆటో ఖర్చులు తనే భరించి వాళ్లను సభకు తీసుకువెళ్లిందావిడ.

స్త్రీల సమస్యల గురించి, సంఘసేవ ఆవశ్యకత గురించి ప్రసంగపాటం సిద్ధం చేసుకుని మరీ వచ్చింది.

ఎందుకన్నా మంచిదని తెలిసిన ఫోటోగ్రాఫరుకు చెప్పింది తను మాట్లాడే టప్పుడు ఫోటో తీయమని.

తెలిసిన వాళ్ల ద్వారా పంపిస్తే తన ఫోటో పేపర్లో తప్పక వస్తుందని నమ్మ కంగా ఉంది.

తనను స్టేజి మీదకి ఆహ్వానించారు.

'నా శ్రమకు గుర్తింపు దొరికింది చూశారా?' అన్నట్టు భర్తవైపు గర్వంగా చూసి వేదిక మీదకి వెళ్లింది. వివిధ స్త్రీ సంఘాల ప్రతినిధులను స్టేజి మీదకి పిలవడం వలన వేదక మీద ఉన్న జనం హాల్లో ఉన్న జనం సంఖ్యలో సమా నంగా ఉన్నారు.

ఎవరో ఇద్దరు మహిళలు మాట్లాడ్డం అయ్యాక మంగమ్మగారిని మాట్లాడ మని కోరారు.

ఆవిడ లేచి మైకుదగ్గరికి వచ్చి నిలబడి, తను కట్టుకున్న గద్వాల చీర బోర్డరు, కొంగు బాగా కనబడేట్టు సర్దుకుని మాట్లాడ్డానికి మొదలుపెడుతుండ గానే సభలో ఒక మూల కలకలం రేగింది.

"మా సంఘం అధ్యక్షురాలిని వేదిక మీదకి పిలవకుండా ఏ గుర్తింపూ లేని సంఘాల వాళ్లను వేదిక ఎక్కించడం అన్యాయం." అంటూ ఒక ఇరవైమంది మహిళలు లేచి గోలగా అరవసాగారు.

ఒక కార్యనిర్వాహకురాలు వచ్చి కంగారుగా మంగమ్మగారిని స్టేజి మీద నుండి కిందకు తీసుకువెళ్లింది.

సభలో అల్లరి సద్దుమణగకపోవడంతో మంగపతిగారు భార్యను బయటకు తీసుకువచ్చేశారు.

ఆవిడ వెనకాలే ఆమె తీసుకువచ్చిన ఆడకూలీలు వచ్చేశారు.

"ఏందమ్మోవ్ మాకు డబ్బులివ్వవా ఏంది?" అంటూ.

"నీకు గవుర్మెంటు శానా డబ్బులిస్తుందంటగదా. మా పిల్లలకు ఏటి ఖరుసు సేసినావు?" అని నిలదీసింది ఒకామె.

"చూడమ్మా...మాకు గవర్నమెంటు డబ్బులేమీ ఇవ్వలేదు. మా సొంత డబ్బు మీ కోసం ఖర్చు పెట్టాం. మీరిక వెళ్లండి. రేపటి నుండి పిల్లలను పంపిం చవద్దమ్మా షెడ్ పీకేస్తున్నాం" అంటూ వాళ్లకు ఇవ్వాల్సింది ఇచ్చి మంగమ్మ గారిని కారెక్కించారు మంగపతిగారు.

"నువ్వేమీ బాధపడకు. మంచిని అర్థం చేసుకోలేరు మామూలు జనం" అంటూ ఆవిడను ఓదార్చారు ఇంటికి వచ్చాక.

"ఈ చిన్న చిన్న ఎదురు దెబ్బలకే కృంగిపోతే ఇక నేను మానవసేవ ఎలా చేయగలను? ఈ సారి నేను చేయబోయే సేవా కార్యక్రమం ఇండియాలో కాక అమెరికాలో మొదలుపెడతాను. అక్కడ 'హోమ్ ఫర్ ది ఏజ్డ్'లోనూ, 'రిటైర్ మెంట్ ఇన్స్'లోనూ వాలంటీర్ల కోసం పేపర్లో ప్రకటన ఇచ్చి మరీ అడుగుతా రుగా. సేవ చేయాలనుకునే నాలాటి వాళ్లకు ఏ దేశమయితేనేం?" మారుతీ కారు దిగి వచ్చిన మంగమ్మగారు మైక్రో ఆవెన్‌లో కాఫీ వెచ్చపెట్టుకుని త్రాగాక కాస్త తేరుకుని ధీమాగా అన్నారు.

మంగపతిగారు హతాశులైపోయారు.

★

## వ్యతిరేకత



తెలుగు నుంచి తమిళ రంగానికెళ్లిన శ్రీయ ప్రస్తుతం తాను హీరోయిన్‌గా నటి స్తున్న 'వర్షం' తమిళ వెర్ష న్‌లో ఆమె ముద్దు సీన్‌లో నటించిందనే వార్త ఒక్కసారిగా చిత్ర పరిశ్రమలో గుప్పు మంది. దానికి శ్రీయ బదులిస్తూ "నేను గ్లామ ర్‌గా నటించడానికే ఇష్టప డతానుకానీ ఇలా ముద్దు సీన్లలో మాత్రం ఎప్పటికీ నటించను. ఇలాంటి రూమర్లు ఎందుకు పుట్టాయో నాకర్థం కాదు. నా ఇమేజ్‌ని పాడుచే సుకునే విధంగా నేనెప్పుడూ ప్రవర్తిం చను. గ్లామర్, టాలెంటెడ్ హీరోయిన్‌గా నటిగా పేరు తెచ్చుకోవాలన్నదే నా అభిమతం" అంటూ ముద్దు సీన్లపై తన వ్యతిరేకతని తెలియచేసింది.

